వరి పంట ఆశాజనకం

- చీడపీడల బెడద తక్కువ
- వేరుశనగ పంట నష్టపోయిన రైతుకు భరోసా
- మడకశిర డివిజన్‌లో 220 హెక్టార్లకు పైగా వరి సాగు



మడకశిర చెరువు వద్ద సాగులో ఉన్న వరి పంట

మడకశిరరూరల్: మడకశిర వ్యవసాయశాఖ డివిజన్‌లో బోరు బావుల కింద సాగు చేసిన వరి పంట ఆశాజనకంగా ఉంది. ఖరీఫ్ వేరుశనగ పంట నష్టం మిగిల్చినా వరి మాత్రం రైతుకు భరోసా ఇచ్చింది. మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల్లో రైతులు ఎకరా వరి పంట సాగుకు రూ.20 వేల వరకు ఖర్చు పెట్టి దాదాపు 220 హెక్టార్లుకు పైగా పంటను సాగు చేశారు. పంటకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతుల ద్వారా సాగు చేసిన వరి పంటకు చీడపీడల వ్యాప్తి తక్కువగా ఉండడంతో పంట ఆశాజనకంగా ఉంది. వాతావరణ పరిస్థితులు, అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలకు వరి పంట బాగుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి పైరు కంకి నిండ వరి గిజలను పరిశీలిస్తే ఎకరాకు 30 నుంచి 35 బస్తాల వరకూ దిగుబడి రావచ్చని రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన భూగర్భ జలాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2019 నుంచి మూడు సంవత్సరాలు హంద్రీనీవా కాలువ ద్వారా మడకశిర మండలంలోని చెరువులకు కృష్ణాజలాలు నింపడంతో పాటు కురిసిన వర్షాలతో బోరు బావుల్లో భూగర్భజలాల మట్టం పెరిగింది. దీంతో నీటికి ఇబ్బందులు తప్పాయని రైతులు చెబుతున్నారు.

పెట్టుబడి సాయమేదీ?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు కావస్తున్నా వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వలేదని అన్నదాతలు విమర్శిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైనా అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందలేదు. కనీసం రబీలో పంటల సాగుకైనా పెట్టుబడి సాయం అందిస్తే బాగుండేదని ఆ పరిస్థితి కూడా కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పంట సాగు చేయాల్సి వస్తోందంటున్నారు.

ఎకరాకు 35 బస్తాల దిగుబడి



బోరు కింద ఎకరాలో వరి సాగు చేశాను. చీడపీడల వ్యాప్తి లేకపోవడంతో కోత దశలో పంట ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 35 బస్తాలకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. పంట సాగుకు పెట్టిన ఖర్చు పోనూ ఆదాయం వస్తుంది. గత ప్రభుత్వంలో వ్యవసాయానికి ప్రాధాన్యమిచ్చారు. అయితే కూటమి ప్రభుత్వంలో ప్రాధాన్యత లేదనే చెప్పవచ్చును. ఇప్పటి వరకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందించలేదు.

– రామరెడ్డి, ఎల్లోటి, మడకశిర మండలం

వరి పంట బాగుంది



బోరు కింద సాగు చేసిన మల్బరీ పంటను తొలగించి రూ.20 వేల ఖర్చు పెట్టి ఎకరాలో సాగు చేసిన వరి పంట ఆశాజనకంగా ఉంది. పంటకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడడంతో తెగుళ్ల వ్యాప్తి లేదు. ఎకరాకు 40 బస్తాలకు పైగా దిగుబడి రావచ్చు అనుకుంటున్నాను. కష్టానికి ఫలితం దక్కుతుందన్నారు.

– గాధరప్ప, కల్లుమర్రి, మడకశిర మండలం

వాతావరణం అనుకూలంగా ఉంది



ఈ ఏడాది ఖరీఫ్‌లో బోరు బావుల కింద 220 హెక్టార్లకు రైతులు వరి పంటను సాగు చేశారు. వాతావారణ అనుకూలంగా ఉండడంతో చీడపీడల వ్యాప్తి తగ్గింది. వరిపంట ఆశాజనకంగా ఉంది. ముఖ్యంగా వరి పంటకు రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను సాగు చేయడం వల్ల పంట మంచి దిగుబడిని సాధిస్తున్నారు.

– కృష్ణమీనన్, ఏడీఏ మడకశిర డివిజన్

క్లుప్తంగా

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

గోరంట్ల: ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు స్థానిక ప్రభుత్వాస్పత్రి ముందు మంగళవారం నిరసన తెలిపారు. ఆశా వర్కర్ల పదవీ కాలం 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతామని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ జీఓ విడుదల చేయకపోవడంతో అనేక మంది రిటైర్ అయ్యారన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మెడికల్ ఆఫీసర్ శృతికి అందజేశారు.

డ్రిప్ పరికరాలు సద్వినియోగం చేసుకోండి



రైతుకు డ్రిప్ సామగ్రిని అందిస్తున్న దృశ్యం

అగళి: ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న డ్రిప్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఎంఐపీ ఏఓ నరసింహప్ప సూచించారు. మంగళవారం 9 మంది రైతులకు డ్రిప్ పరికాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రిప్ వినియోగంతో తక్కువ నీటితో ఎక్కువగా పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. అర్హత ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డైనింగ్ హాల్‌కు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న దాతలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు

పెనుకొండ: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు, దాతల సహకారంలో డైనింగ్ హాల్ నిర్మాణానికి మంగళవారం భూమి పూజ జరిగింది. అభయ ఫౌండేషన్ నిర్వాహకులు సుంకు బాలచందర్ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం జ్యోతిలత, న్యాయవాది ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి



మృతుడి భార్య గోవిందమ్మకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

అమరాపురం: మండల పరిధిలోని వలస గ్రామ సచివాలయంలో కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న మారన్న (70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న వీఆర్ఓ రవికుమార్, సచివాలయం సిబ్బంది మారన్న మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం తక్షణ సహాయం కింద రూ.15 వేల నగదును మృతుడి భార్యకు అందించారు. మారన్నకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వైద్య సేవల్లో అలసత్వమొద్దు

చిలమత్తూరు: హెల్త్ సెంటర్లలో అందించే వైద్య సేవల్లో అలసత్వం ప్రదర్శించకూడదని వైద్యాధికారి డా.రామకృష్ణ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది , ఆశా కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జయచంద్ర, వైద్య సిబ్బంది, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రైల్వేస్టేషన్ రహదారి



కంకర తేలిన రైల్వేస్టేషన్ రోడ్డు

పెనుకొండ: పట్టణంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. మార్కెట్‌యార్డ్ సమీపం నుంచి రైల్వేస్టేషన్ వరకూ రోడ్డు పూర్తీ కంకర తేలడంతో పాటు గుంతలు పడటంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని వాపోతున్నారు. అధికారులు తగిన చర్యలు చేపట్టి రోడ్డు వేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: నియోజకవర్గంలోని ఐదు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పులు చేసి ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తే వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రబీ పంట సాగుకు వంద శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలను అందించాలని పేర్కొన్నారు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

- సోమందేపల్లి వాసులకు గాయాలు



ప్రమాదానికి గురైన కారు

సోమందేపల్లి: మండల కేంద్రానికి చెందిన పవర్ లూమ్స్ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు కుమార్తె వివాహ వేడుక కోసం కర్ణాటక వెళుతుండగా గౌరీబిదనూరు సమీపంలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. మినీ బస్సు రెండు కార్లను ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను గౌరీబిదనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తుమ్మల మారెమ్మకు పూజలు



అలంకరణలో మారెమ్మ

గుడిబండ: పట్టణ సమీపంలో వెలసిన తుమ్మల మారెమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమ అర్చనలు తదితర ప్రత్యేక పూజలు చేశారు. విశేష పూజ రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

బాలికలను రక్షిద్దాం.. చదవనిద్దాం



మాట్లాడుతున్న సీడీపీఓ శాంతలక్ష్మి

రొద్దం: బాలికలను రక్షిద్దాం..బాలికలను చదవనిద్దాం. 18 ఏళ్లు నిండిన తర్వాతనే పెళ్లిళ్లు చేయాలి' అని విద్యార్థునులకు లఘుచిత్రాల ద్వారా అధికారులు అవగాహన కల్పించారు. మంగళవారం మండల పరిధిలోని నారనాగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆర్డీటీ, జిల్లా శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా బాలల హక్కులు, బాల్య వివాహాలు, వాటి వల్ల అనర్థాలపై ఆర్డీటీ మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ ఆధ్యక్షతన లఘుచిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు జరిగితే 1098, 100, 112 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, హెచ్ఎం రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



హిందూపురం: రైతులకు సూచనలిస్తున్న ఏడీ అల్తాఫ్ అలీఖాన్

రొద్దం: వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగబడులు సాధించవచ్చని ఏడీఏ సనావుల్లా , ఏఓ నివేదిత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నారనాగేపల్లి, జక్కలచెరువు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం, ద్రవ జీవామృతం చేసే ప్రక్రియ, వాటి వలన కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మి, రైతు సేవా కేంద్రం రఘునాథ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: రైతులు రసాయనిక ఎరువులకు స్వస్తి పలికి సేంద్రియ ఎరువుల ద్వారా అధిక దిగుబడి సాధించాలని ఏఈఓ చంద్రకళ, వీపీఏ అపర్ణ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం మండల పరిధిలోని కొత్తపాళ్యం, కొడగార్లగుట్ట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రాగి ఇతరాత్ర పంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు.

హిందూపురం: మెట్టభూముల్లోనూ వ్యవసాయ సూచనలు పాటిస్తూ వరిసాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని అగ్రికల్చర్ ఏడీ అల్తాఫ్ అలీఖాన్ అన్నారు. హిందూపురం మండలం మలుగూరు రైతు సేవ కేంద్రం, వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి మహేష్‌నాయక్, ఏఓ సురేంద్రనాయక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది కృష్ణ యాదవ్ రైతులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపిక



సాయి హర్షితను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

హిందూపురం టౌన్: పట్టణంలోని స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాయి హర్షిత జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌గా ఎస్కే యూనివర్సిటీ నుంచి ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి తెలిపారు. మంగళవారం కళాశాలలో సాయి హర్షితను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సాయి హర్షిత ఏపీ తరపున గుజరాత్ రాష్ట్రంలోని హేమచంద్రాచార్య నార్త్ గుజరాత్ యూనివర్సిటీ, పటాన్‌లో ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకూ జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో క్లాసికల్ డాన్స్‌లో ప్రదర్శన ఇవ్వనుందన్నారు. అలాగే పోలీసుశాఖ ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన, వకృత్వపు పోటీల్లో రెండింటిలోనూ ప్రథమ స్థానంలో నిలిచిన కళాశాల విద్యార్థినులు మదీహా, సిరివల్లిలను కూడా అభినందించారు.

ఒప్పంద జీఓలను విడుదల చేయండి



వైద్యాధికారిణికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పెనుకొండ: ప్రభుత్వం ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర సీఐటీయూ ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందం జీఓలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఆశాడే సందర్భంగా వైద్యాధికారిణి సౌమ్య, గుట్టూరు వైద్యా నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందించారు.

మహాసభ విజయవంతం చేయండి

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండలాధ్యక్షుడు అనిల్‌కుమార్, హెచ్ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. గౌరవాధ్యక్షుడు భూతన్న మాట్లాడుతూ ఈనెల 10న కదిరిలో జరిగే యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ నాయకులు శ్రీకాంత్, రమేష్‌బాబు, ఖాదర్‌వలీ, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

మడకశిరరూరల్: మండలంలో వివిధ గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలను జరుపుకున్నారు. మంగళవారం ఉపవాస దీక్షతో పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాల వద్ద ప్రతిష్టించిన నాగు దేవతల విగ్రహాలకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఆలయాల్లో కార్తీక మాసం పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రసాద వినియోగం చేశారు.

విగ్రహాల ప్రతిష్ట

హిందూపురం: నాగుల చవితి పండుగను పురస్కరించుకుని లేపాక్షి ఆలయ చైర్మన్ కరణం రమానందన్ హిందూపురం పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నాగుల విగ్రహాలకు ప్రతిష్ట చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలతో అన్నదానం చేపట్టారు.

డిగ్రీ పరీక్ష ఫీజు కట్టించుకోవాలి

హిందూపురం టౌన్: కళాశాల ఫీజులతో సంబంధం లేకుండా డిగ్రీ విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు పరీక్ష ఫీజులు కట్టించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని, నేటికీ చెల్లించలేదన్నారు. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులను వేధిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా గిరియప్ప

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆర్ఐగా గిరియప్ప బాధ్యతలు స్వీకరించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ తెలిపారు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మంజునాథ్ ఇన్‌చార్జ్ ఆర్ఐగా పని చేసేవారన్నారు. దీంతో అమరాపురం మండలం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పని చేస్తున్న గిరియప్ప బదిలీపై రొళ్లకు వచ్చారన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి

అగళి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శివనంద ఆధ్వర్యంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివనంద మాట్లాడుతూ.. ఆశ వర్కర్లు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. దగ్గు, జ్వరం, జలుబు తదితర చిన్నపాటి వాటికి కూడా మందులు అందించాలన్నారు. ముఖ్యంగా మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి డెలివరీ వరకూ ప్రతినెలా వారికి సూచనలు చేస్తూ సాధారణ ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలన్నారు.

డెయిరీలో చోరీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం గ్రామంలోని పాల డెయిరీలో సోమవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గదిలో ఉంచిన వివిధ సామగ్రిని చల్లాచదురు చేసి పాలు పోసే వారికి చెల్లించడానికి ఉంచిన నగదు, సెల్‌ఫోన్ దొంగలించుకెళ్లారని పాలు కొలిసే యజమాని అడివన్న తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించామన్నారు.

రావుడి వీఆర్‌ఓగా నరసింహమూర్తి

అగళి: మండలం పరిధిలోని రావుడి పంచాయతీ వీఆర్‌ఓగా నరసింహమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన నాగరాజు రొళ్ల మండలానికి బదిలీ అయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నరసింహమూర్తి తెలిపారు.

వ్యక్తికి గాయాలు

సోమందేపల్లి: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి ఈద్గా మైదానం వద్ద మంగళవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో పెనుకొండకు చెందిన ఖాశీంపీరాకు గాయాలయ్యాయి. హిందూపురం నుంచి పెనుకొండకు వెళ్తుండగా రోడ్డుపై గుంత గమనించకపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వళ్లూరు అధ్యక్షుడిగా ముత్యాలన్న

పావగడ: తాలూకాలోని వళ్లూరు గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా ముత్యాలన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అధ్యక్ష స్థానం ఎన్నికల్లో ముత్యాలన్న ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎలాంటి పోటీ లేకుండా ముత్యాలన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వరదరాజు ప్రకటించారు.

క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు



కిశోర్‌బాబు



చందన



చరణ్



లేపాక్షి: రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కొండూరు విద్యార్థులు



లేపాక్షి: నవదీపక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

- రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో ప్రతిభ

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు 68వ రాష్ట్రస్థాయి (ఎస్‌జీఎఫ్) పోటీల్లో ప్రతిభ కనపరిచి బంగారు పతకాలను సాధించారని హెచ్ఎం కృష్ణమోహన్‌రెడ్డి, పీడీ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. పదో తరగతి చదుతున్న బీ చరణ్ అండర్-17 రాష్ట్రస్థాయి వాలీబాల్‌లో నైపుణ్యం ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. అలాగే అండర్ -14 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీలో విద్యార్థులు కిశోర్‌బాబు, చందన జట్టును ప్రథమ స్థానంలో నిలపడంలో కీలక పాత్ర పోషించి బంగారు పతకాలు సాధించారు. క్రీడాకారులను ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

అథ్లెటిక్స్‌లో మెరిసిన పురుషోత్తం



పురుషోత్తం



అలేఖ్య

పావగడ: తాలూకాలోని దొమ్మతమరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి పురుషోత్తం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రథమ స్థానంలో గెలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శిర పట్టణం వివేకానంద క్రీడా మైదానంలో మంగళవారం పరుగు పందెం పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపాడు. ఈ నెల 14 న శివమొగ్గలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు ఆ పాఠశాల హెచ్ఎం హనుమంతరాజు తెలిపారు. హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయురాలు వరలక్ష్మి తదితరులు హర్షం ప్రకటించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పెనుకొండ రూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాంపురం హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి అలేఖ్య ప్రతిభ చూపినట్లు హెచ్ఎం ఇందిర, వ్యాయామ ఉపాధ్యాయుడు దివాకర్ తెలిపారు. డిస్కత్రోలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈనెల 6వ తేదీన ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

లేపాక్షి: అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో కొండూరు పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు అశోక్, వ్యాయామ ఉపాధ్యాయుడు శివకుమార్ తెలిపారు. అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో దుర్గాప్రసాద్, అండర్-14 బాలికల విభాగంలో లలిత, అండర్-14 విభాగంలో మొదటి స్టాండ్ బైగా పరమేష్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. అలాగే అండర్-17 బేస్‌బాల్‌లో నౌషద్, అండర్-14లో లోహిత్, ప్రభాకర్ ఎంపికై నట్లు పేర్కొన్నారు. నెట్‌బాల్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి నాని, 8వ తరగతి విద్యార్థిని నవ్య రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు.

పులమతి విద్యార్థికి కాంస్య పతకం

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పులమతి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నవదీపక్ 102 ప్లస్ క్యాటగిరిలో కాంస్య పతకం సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు రామాంజినేయులు తెలిపారు. ఈ పోటీలు గుంటూరు జిల్లా తెనాలిలో ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకూ జరిగాయని పేర్కొన్నారు.

రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



లింగదహళ్లి రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా వ్యాప్తంగా రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ పేర్కొన్నారు. లింగదహళ్లిలో రూ 1.80 కోట్ల నిధులతో నిర్మించనున్న లింగదహళ్లి-సాసలకుంట రోడ్డు పనులకు మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంత వరకూ భూమి పూజలు చేసిన రోడ్ల పనులు సాధ్యమైనంత త్వరలో పూర్తి అవుతాయన్నారు. అనంతరం ఆయన రూ 10 కోట్ల వ్యయంతో నిర్మించే పావగడ- చళ్లకెరె రోడ్డు , రూ 10 కోట్ల నిధులతో నిర్మించే పావగడ-అరసికెరె రోడ్డు పనులకు భూమి చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

హిందూపురం డివిజన్

9912220717, 9912220723, 9705346587
9010200238, 9912220726